కథానిక

# ఆనాడూ యీనాడూ బుచ్చిరాయుడే!

మృత్యుంజయుడు

బుచ్చిరాయుడుగారంటే ఆవూళ్లో చాలా పేరుమోసిన మనిషి. ఒక్క ఆవూరే నన్న మాటేమిటి? చుట్టూ పదిపన్నెండు వూళ్లదాకా ఆపేరు అలా మోగుతోనే వుంది.

అసలిదొక మహా విషయం. వారిచేతి మీదుగా ఎవరికైనా అప్పు యివ్వనివ్వండి. తిరిగి అది తీరే పని లేదు. పెరిగిపెరిగి చివరకు, ఏ పొలం రూపంలోనో, దొడ్డి ఆకారంగానో, వచ్చి వారి ఆస్తిలో కలిసిపోవలసిందే. ఎలా లేదన్నా బుచ్చిరాయుడిగారి హయాంనికిముందే 300 ఎకరాలు మించింది పొలం. అది ప్రతి సంవత్సరమూ తెచ్చే ఆదాయం ఏంచెయ్యాలో తోచని దశకూడా ఏర్పడింది ఒకప్పుడు-భూమి మీద ఎంత డబ్బు పెడితేమాత్రం ఏం తరుగుతుంది? పొలాలు కౌలుకిస్తూంటే ఖర్చులుకూడా లేకుండా గిట్టుబాటౌతున్నాయాయెను. అందుకనే బుచ్చిరాయుడుగారి తండ్రి గుణించిగుణించి ఆ ఆదాయాన్ని వ్యాపారం వగైరాల మీదికి మళ్లించాడు. ఇవతల భూములు అవతల వ్యాపారం అన్నీ ఆ ఆదాయాన్ని బ్రహ్మాండంగా పెంచుకుపోతున్నాయి. అగస్త్యుడు రాకముందు వింధ్యాద్రి పెరిగేవన్నట్టు - బుచ్చిరాయుడిగారి బుద్ధికుశలతలో అవి మరీ పరాకాష్ఠ నందుకున్నాయి.

ఆ చుట్టుపట్ల పది పన్నెండూళ్లలోనూ - ఎవరికో పెళ్లి వస్తుంది. వీరి దగ్గరకు అప్పుకు రావాలి. ఎవరికో చావు వస్తుంది. వీరిదే కట్టెల అడితి. శవంమీదికి గుడ్డ కావాలి. వీరివే గుడ్డల కొట్లు. ఎవరో ఎక్కడికో ప్రయాణం పెట్టుకుంటారు: వీరివే బస్సులు. తిండికి బియ్యం కావాలి. వడ్ల మరలు వీరివే. వీరివే రేషనింగు దుకాణాలు. చివరకు కాల్చుకునే చుట్ట పొగాకు సైతం వీరి పొలాలలో పండేదే. కొంతమంది కుర్రవాళ్లు సిగరెట్లు ప్రారంభించి, ఆ కాస్తానన్నా కాదనిపించాలని చూచినట్టుంది. కాని - దొర పొగాకూ, బ్యారన్లూ తెప్పించడంతో బుచ్చిరాయుడుగారు అదికూడా నిలబెట్టుకున్నాడు.

ఎవరూ యిలా ఆలోచించరుగాని, ఒక్క రోజు గనక బుచ్చిరాయుడు వ్యాపార వ్యవహారాలు కట్టేసినట్టాయెనా, ఆ చుట్టుపట్ల జనం మొత్తానికి వురిపోసుకోవడానికి తాడుకూడా దొరకదు. ఆ ప్రజల నిత్య జీవితంలో బుచ్చిరాయుడుగారు అలా భాగమైపోయాడు.

ఐతే చాలామంది జనానికి వారిమీద ద్వేషం లేకపోలేదు. ఎప్పుడో మరీ పట్టరాని కష్టాల్లో- ఓ క్షణంపాటు 'కాసులుగల వాడే రాజు గదరా సుమతీ!' అన్న నీతిని మరచిపోతారు. దుమ్మెత్తుతారు. కాని చేసేదేముంది! కొంతమంది— కాంగ్రెస్ వచ్చాక ఆయన భూములు లాక్కొంటుందనీ, ఎవరివి వాళ్ల కిస్తుందనీ, ఎవరి కసి కొద్దీ వాళ్లు చెప్పుకుని తృప్తిపడుతుండే వాళ్లు.

కాని ... బుచ్చిరాయుడు గారి వంశమే మాంచి తెలివితేటలు గలది. కాదనడానికి వీల్లేదు. ఈప్రాంతం నైజాంలో వున్నప్పుడు వీరు ఆ నవాబునే ఆశ్రయించుకున్నారు. అది కాస్తా బ్రిటిష్‌వాళ్ళ క్రిందికి వచ్చాక తిరిగీ బ్రిటిష్ వాళ్లనే నమ్ముకున్నారు. వాళ్ళకే అంతా అండగా వున్నారు. అంతేగాని— కాంగ్రెసనీ, మరొకటనీ యిలా ఎప్పుడూ గంతులు పెట్టి ఎరగరు.

కాంగ్రెస్ ఉద్యమం మాంచి ఝోరుగా సాగేరోజుల్లో చాలామంది 'ఇదుగో స్వరాజ్యం అదుగో స్వరాజ్యం' అన్నారు. కాని బుచ్చిరాయుడుగారి తండ్రి మాత్రం యీ వుడకపూపులకి వులకలేదు. మీటింగులు చెదగొట్టటం దగ్గర్నించీ, లాఠీచార్జీ చేయించడం, కాంగ్రెస్ ప్రచారకులకి గుక్కెడు నీళ్లు పుట్టకుండా చెయ్యటందాకా ముందుకొమ్మే కాశాడు. ఈ చుట్టుపట్ల ఎక్కడా కాంగ్రెస్ జండా ఎగరరాదన్నాడు. అంతే. ఆవూళ్లోనే కాంగ్రెస్

నాయకుడుగా దేశమంతా పేరు మోసిన చక్కరయ్య ఆస్తి వేలానికి వచ్చింది. ఎవ్వరూ కొనటానికి ముందుకు రాలేదు. అప్పుడు బుచ్చిరాయుడుగారి తండ్రి మంచంలో వున్నాడు. అయినా బుచ్చిరాయుండే స్వయంగావచ్చి పదిహేనెకరాలపొలమూ పదిహేను రూపాయలకు పాడుకుపోయాడు. తండ్రిపరువు నిలబెట్టాడు. వీటన్నిటి ఫలితంగానే మొట్టమొదటి పంచాయతీ ప్రసిడెంటుగా ఆయన్నే నియమించారు. ఇప్పటిదాకా అయనే. తిరుగులేదు.

ఆలా ఎప్పటికప్పుడు సర్కార్ని తమ చేతుల్లో పెట్టుకున్నారు గనుకనే యిన్ని వ్యవహారాలూ సాగించగలిగారు, వారు ఎంత గొప్ప వాళ్లు కాకపోతే ... ఎంతోమంది కాంగ్రెస్ నాయకులు ఆయన్ని కాంగ్రెస్‌లో చేరమని ఆహ్వానించుతారు? మరీ ఒకాయన 'కాంగ్రెస్ మరదృష్టం' అన్నాడు కూడా.

ఐతే-స్వరాజ్యం వచ్చి, కాంగ్రెసే అధికారంలోకి వచ్చాక, బుచ్చిరాయుడుగారి మహాదశ కాస్తా బుడుంగు మంటుందని చంకలు కొట్టారు చాలామంది. నిజంగా అలాంటి దెబ్బ రానేవచ్చింది కూడాను.

అప్పటికే గ్రామంలో రెండు పార్టీ లున్నాయాయె, అందులోనూ ఆయనకు వ్యతిరేక పార్టీ కాంగ్రెసు. ఆపార్టీ నాయకుడు కూడా సామాన్యప్పావలా బాపతు కాంగ్రెస్ కాదు. మూడు సార్లు జైలు కెళ్లాడు. మోకాళ్లూ, మోచేతులూ, కీళ్లూ విరగ్గొట్టించుకున్నాడు. పదిహేను ఎకరాలూ పోగొట్టుకున్నాడు. అతడి అవస్థల కన్నిటికీ ప్రత్యక్ష కారణం యీ బుచ్చిరాయుండే కూడా.

ఇలాంటి పరిస్థితుల్లో- అధికారమే కాంగ్రెస్‌దయ్యాక ఎంత అహింస ఐతేమాత్రం చక్రయ్య వూరుకుంటాడా? కనీసం పదిహేను రూపాయలుకు కట్టుకున్న పదిహేను ఎకరాల దగ్గరన్నా కుస్తీ సాగదా? ఇలా ఆలోచించారు సామాన్య జనం. అధికారంలో వున్నది కాంగ్రెసనీ, అది చేసిన త్యాగాలనీ చూపి చక్కరయ్య కాంగ్రెస్‌ని బలపర్చి తన మహాబలాన్ని పెంపుచేస్తున్నాడు. తాను కన్న కలలన్నీ నిజమౌతాయని గుటకలు మింగుతున్నాడు.

జనం కూడా లోలోన బుచ్చిరాయుడుకి వ్యతిరేకమే. వాళ్ల పాతచరిత్రలు తవ్వుకుంటున్నారు. ఇన్నాళ్ళదాకా తెల్లవాడి ప్రభుత్వం బుచ్చిరాయుడి ప్రభుత్వమే. ఆ కారణాన అణిగిపడి వున్నారు. కాని యిప్పుడో — అంతా మారింది. బుచ్చిరాయుడికీ, ఆయన తెల్లసర్కారుకీ వ్యతిరేక ప్రభుత్వం వచ్చింది. చక్కరయ్యగారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పటిదాకా బుచ్చిరాయుడుమీద కసి తీర్చుకునే శుభ సమయానికి ఎదురుచూస్తున్న జనం కాంగ్రెస్ లో చేరుతున్నారు. బుచ్చిరాయుడు ముఠా జనం కూడా చేరిపోతున్నారు.

'బుచ్చిరాయుడుగారుకూడా కాంగ్రెస్‌లో చేరిపోతేనే మంచిది' అన్నారు కొంతమంది జాలిగా—

'ఏ ముఖం పెట్టుకుని చేర్తాడు' అన్నారు కొందరు ఈర్ష్యగా—

'బుచ్చిరాయుడు విరగ్గొట్టించిన కాలు ఇంకా యీడ్చుకుంటూనే తిరుగుతున్న చక్కరయ్యకి ఆమాత్రం గుర్తులేదూ?' అన్నారు కొందరు—

కాంగ్రెస్ చాలా పవిత్రమయిందనీ, అందులో చేరడానికి బుచ్చిరాయుడు ఎంతమాత్రమూ తగడనీ జనం భావించారు.

బుచ్చిరాయుడికి మాత్రం యివేవీ పట్టినట్టే లేదు. లోపల ఏమున్నా బయటికేమీ పొక్కటం లేదు.

నెమ్మది నెమ్మదిగా బుచ్చిరాయుడు చక్కరయ్యల మధ్య సన్న సన్న కుస్తీలు ప్రారంభమయ్యాయి. అవి చిలికి చిలికి పెద్ద గాలివానగా కూడా మారాయి.

...ఊళ్లో ఎక్కడా బియ్యపుగింజ దొరక్క నానా అవస్థ పడుతున్నారు జనం. బుచ్చిరాయుడు మాత్రం రాత్రిళ్లు రాత్రిళ్లు లారీల నిండా తోలేస్తున్నాడు ఎక్కడికో.

కూలినాలి జనం యిక ఆగలేకపోయి బుచ్చిరాయుడిమీద పడ్డారు. బుచ్చిరాయుడు ఆ వూళ్లో లేని కమ్యూనిస్టులమీద పడ్డాడు. జనం అంతా యిక లాభం లేదని పోయి చక్కరయ్య మీద పడ్డారు. చక్కరయ్యకూడా కదిలాడు. వూళ్లో అందర్నీ అడిగినట్టే బుచ్చిరాయుణ్ణీ అడి

గాడు. 'కంట్రోల్ రేటుకు కొన్నైనా గింజలు వూళ్లో జనానికియ్యి.'

'కమ్యూనిస్టులు నిన్నూ బుట్టలో వేసుకున్నారన్న మాట'—ఎగిరిపడ్డాడు బుచ్చిరాయుడు. చక్రయ్య కలవరపడ్డాడు: 'కమ్యూనిస్టు లెక్కడ? కలవటమేమిటి?' ఏమైనా సరే — నిరసనవ్రతం చెయ్యాలనుకున్నాడు. యిలా అనుకుంటుండగానే — ఒకనాటి రాత్రి బుచ్చిరాయుడుగారి దొంగ బియ్యం 200 బస్తాలు పట్టుకున్నారు.

పైన అధికారం కాంగ్రెస్‌ది. పట్టుకున్న వాళ్లు ప్రజలే. కాంగ్రెస్ అయిన ప్రజలూ, కాంగ్రెస్ నాయకుడు చక్రయ్యా. ఎలాగా బుచ్చిరాయుడికి శిక్ష తప్పదనుకున్నారు.

కాని...బుచ్చిరాయుడేమీ ఖంగారు పడలేదు. అధికారులంతా ఆయనను అదివరకునుంచీ ఎరిగినవాళ్లే. కాస్తో కూస్తో ఆయన సొమ్ము తిన్నవాళ్లే. పైన మంత్రులలో ఎవరో మారినందు వల్ల ఏం మునిగిందీ? చక్రయ్యవల్ల ఏమౌతుంది? నిరసన వ్రతం తప్ప—

బుచ్చిరాయుడికి శిక్షాపడలేదు. కాని, దోపిడీ కేసుక్రింద 'కాంగ్రెసే ప్రజలైన' ప్రజలు జైల్లో పడ్డారు. కాంగ్రెస్ చక్రయ్య 'ఇదేమిటా!' అని ఆశ్చర్యపడ్డాడు. అందుతోనించి ఆలోచనలో పడ్డాడు.

పరిస్థితులు వేగాతి వేగంగా పరివర్తన చెందుతున్నాయి. ధరలు పెరిగి పోతున్నాయి. పన్నులు పెరిగి పోతున్నాయి. ఆకళ్లు పెరిగిపోతున్నాయి. వీటన్నిటితో పాటూ జనానికి ఆలోచనలు పెరిగి పోతున్నాయి.

(బుచ్చిరాయుడు ఫాక్టరీలు పెట్టాడు. ఆడ్తీలు పెట్టాడు. ఏమేమో పెట్టాడు. యివి ఏవీ జనం లేకుండా నడవ్వు. జనం అంతా ఒక్కరోజు కనుక యింట్లోనే పడుకుంటే బుచ్చిరాయుడు కాపరం తట్టలోనించి బుట్టలోకి వస్తుంది. జనం అలా బుచ్చిరాయుడు ప్రాణంలోనే భాగమయ్యారు.)

జనం సమ్మె కట్టుకు దిగేట్టున్నారు. చక్రయ్య కెందులో ఏమీ జోక్యం లేదు. అసలాయన అలాంటి వాటి జోలికేపోడు. అది అలవాటు లేదు కూడాను. ఆయనే అందరికోసం ఏదో చేస్తాననీ చెయ్యాలనీ ఆయన తత్వం.

బుచ్చిరాయుడు మాత్రం సామాన్యుడా? ఏమీ పట్టనట్టే వున్నాడు. కౌలు పొలాలు లాక్కోటం మొదలు పెట్టాడు. కొత్త ఎదురు తిరిగే కూలీల నందర్నీ తొలగించటం ప్రారంభించాడు. ఈమధ్యే ఎక్కడికో రెండు సార్లు గ్రామాంతరం వెళ్ళాడు. రెండు సార్లూ రెండు పదిరోజులకి వచ్చాడు. ఏం చేసి వచ్చాడో...యేమో...

ఎవరో దాక్కుంటున్నారని పోలీసులు ఊరంతా తిరగదవ్వుతున్నారు. బుచ్చిరాయుడుగారి శత్రువుల యిళ్ళన్నీ నేల కూలుతున్నాయి. కుండలు, మంచాలు అన్నీ కుంటిపై పోతున్నాయి. జనం అంతా చక్రయ్యని శరణు జొచ్చారు. చక్రయ్య మాత్రం చూడటంలేదా? పైగా 10, 15 ఏళ్లు వెనక్కుపోయి చూస్తున్నాడు. వాటితో వీటిని పోల్చి చూస్తున్నాడు. అప్పుడూ యిప్పుడూ బుచ్చిరాయుడే కనపడ్డాడు చక్రయ్యకి.

చక్రయ్యకు అన్యాయాన్ని చూస్తూ సహించే అలవాటు లేదు. ఆగలేక పోయాడు. పోయి 'ఇదేం అన్యాయం' అన్నాడు.

'ఏమిటా అన్యాయం?' గద్దించాడు ఆఫీసరు.

'వాళ్ల మేనమామ కొడుకో, వాడి బావమరిదో ఎవడో ఒకడు కమ్యూనిస్టు లెండి' నవ్వాడు బుచ్చిరాయుడు.

'జాగ్రత్త' అన్నాడు హుం'తో కలిపి పోలీస్ ఆఫీసర్.

జనం గొల్లుమన్నారు. చక్రయ్య ఒళ్లు ఝల్లుమన్నది. కాంగ్రెసులో చేరామనుకున్న జనమంతా 'కింకర్తవ్యం?' అన్నారు చక్రయ్యని. నీళ్లు నమిలాడు చక్రయ్య. న్యాయం బయటికొస్తుందన్నాడు చక్రయ్య. 'శాంతమే భూషణం' అని బోధించాడు చక్రయ్య.

చక్రయ్య బ్రతికుండగానే, చక్రయ్య కళ్లముందే బుచ్చిరాయుడు రమరమా వేయించాడు: 'జనం అంతా నా ఎదట కాంగ్రెస్‌లో చేరాలి' అని—

'వాడి ఎదటనా? చేరకపోతే—' ప్రశ్నించింది చక్రయ్య అంతరాత్మ.

'చేరక పోలేనా? కమ్యూనిస్టు—' చెప్పింది చక్రయ్య ఆత్మ.

చక్రయ్య అంతరాత్మ మూలుగుతూ ముడుచుకుంది. జనం మట్లాడకుండా మళ్ళీమళ్ళీ బుచ్చిరాయుడుగారి ఎదట కాంగ్రెస్‌లో చేరుతున్నారు. చేరకుండా ఎవళ్లైనా వుంటే వాళ్లని కమ్యూనిస్టుల్ని చేస్తున్నాడు బుచ్చిరాయుడు. కాదని చెప్పేందుక్కూడా సాహసంలేదు చక్రయ్యకి. 'కమ్యూనిస్టులు బుచ్చిరాయుండి కంటె ఏం చెడ్డవాళ్లు' అని అడిగే సాహసం లేదు చక్రయ్యకి. సాహసం చేశాడో-కమ్యూనిస్టు, కనీసం సానుభూతిపరుడు అయ్యేట్టున్నాడు.

చక్రయ్యకు ఆదివరకు లేకపోయినా యిప్పుడు 'కాలానుగుణ్యం' అలవడుతోంది.

ఐతేనేం? బుచ్చిరాయుడిలా, అంతకంటే మెరుగ్గా ఆరవలేక పోతున్నాడు చక్రయ్య కమ్యూనిజంమీద—

ఎలా అరుస్తాడు? ఆస్తిగల బుచ్చిరాయుండికి తెలిసినంతగా, ఆస్తిలేని చక్రయ్యకు తెలియదు కమ్యూనిజాన్ని గురించి.

ఐనా-చక్రయ్య వూరుకోలేదు. కమ్యూనిజాన్ని ఓపినంతలో తిడ్తూనే - ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నాడు.

ఇలా యీ మధ్యలో యింకా చాలా జరిగాయి. కాంగ్రెస్ ఎన్నికలు వచ్చాయి. బుచ్చిరాయుడి డబ్బు, పోలీసు భయం, చక్రయ్యని ఓడించాయి.

అధికాహారోత్పత్తి స్కీముకింద బుచ్చిరాయుండికి ఓ 150 ఎకరాల భూమి మంజూరయింది.

రాజకీయ బాధితుడుగా చక్రయ్యకు రావలసిన పొలం కలెక్టరు నిరాకరణలో ఆగిపోయింది.

ఇలా ఎన్నో—!

చక్రయ్య ఏంచేస్తాడు? కమ్యూనిస్టు వ్యతిరేకతలో తాను తక్కువ తిన్నట్టు అనుమానం చక్రయ్యకి.

ఐనా—'యీ అన్యాయాన్ని పరిశీలించాలి' అని అర్జీ పెట్టాడు పై సంఘాలకి. ఆలాఆలా అఖిలభారత సంఘందాకా వెళ్ళాడు చక్రయ్య.

బుచ్చిరాయుండు అఖిలభారత ప్రభుత్వం దాకా వెళ్ళాడు.

ప్రభుత్వం కాంగ్రెస్ చేతులో వుందా? కాంగ్రెస్ ప్రభుత్వం చేతులో వుందా? అనుమానం వచ్చింది చక్రయ్యకి.

బుచ్చిరాయుండుకి ఏ అనుమానమూ లేదు. కూలి పెరగకుండా, లాభాలు తరగకుండా జాగ్రత్త పడుతున్నాడు.

'కాంగ్రెసే ప్రజలు ప్రజలే కాంగ్రెస్' అన్నాడు చక్రయ్య.

'కాంగ్రెసే ప్రభుత్వం. ప్రజలే ప్రభుత్వం' అన్నాడు బుచ్చిరాయుండు.

చక్రయ్యకి మళ్ళీ అనుమానమే. అంతేనేమోనని- బుచ్చిరాయుండికి మాత్రం ఏ అనుమానమూ లేదు. 'అధమపక్షం ఆరునెల్లకో మాటైనా పల్చపల్చగా తడిపడకపోతే ప్రజలు మాట వినరేమో!' అని తప్ప.

జనంమాత్రం చక్రయ్యని ఒదిలిపెట్టి చాలాకాలమయింది. ఐతే బుచ్చిరాయుణ్ణి ప్రేమిస్తున్నారనికాదు. బుచ్చిరాయుండు ఎప్పుడు చస్తాడా? అని ఎదురు చూస్తున్నారు. కాని బుచ్చిరాయుండు ఇంతలో చావడు. యిప్పుడు బుచ్చిరాయుడే కాంగ్రెస్. కాంగ్రెస్ కాదు. అత్యవసరమైన 'శాంతి· భద్రత' కూడాను. ఇప్పుడు 'శాంతిభద్రత' లకు అపరావతారమైన బుచ్చిరాయుండు-చుట్టూ మిలటరీ కాపలాలో వుంటున్నాడు.

కాని ... చక్రయ్యకు మాత్రం చావు దగ్గర్లోనే వుంది. ఆ అనుమానం జనానిదీ, చక్రయ్యదీ కూడాను.

ఎలాగూ 'శాంతిభద్రతల' రక్షణకు బుచ్చిరాయుండికి ఐదు వందల రౌండ్లు పేలే ఆధునిక ఆయుధాలు ముట్టజెప్తాయి. శాంతి భద్రతలు సర్వం ఐన బుచ్చిరాయుండికి ఒకే ఒక శత్రువైన చక్రయ్య మొదటి గుండు రుచి చూచి కమ్యూనిస్టుగా పత్రికల్లో పడతాడు.

బుచ్చిరాయుండికి ఆ భయమేమీ లేదు. ఐతే, ఆ చక్రయ్య మరణానంతరం పొందే కమ్యూనిస్టు భూతావతారం మాత్రం బుచ్చిరాయుణ్ణి నిద్దర పోనివ్వడం లేదు.